## క్లుప్తంగా

### హుండీ ఆదాయం రూ.1.35 లక్షలు



నందిగామ రూరల్: మండలంలోని లింగాలపాడు గ్రామంలో వేంచేసియున్న లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారికి హుండీ కానుకల ద్వారా రూ.1,35,433 ఆదాయం వచ్చినట్లు ఈఓ నరసింహ మూర్తి తెలిపారు. స్థానిక ఆలయ ఆవరణలో సోమవారం హుండీ కానుకలను లెక్కించారు. చందర్లపాడు గ్రూపు టెంపుల్స్ ఈవో మునగాల తేజ, ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త వెంకట లక్ష్మీ సాయిబాబు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న విజ్ఞాన తరగతులు



కొణకంచి(పెనుగంచిప్రోలు): స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు కొనసాగుతున్నాయి. సోమవారం గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు ఆధ్వర్యంలో విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. అనంతరం విద్యార్థులు కథలు చదివి వినిపించటంతోపాటు డ్రాయింగ్ వేశారు. క్యారమ్స్‌పై శిక్షణ పొందారు.యోగా శిక్షకుడు సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాలు, ధ్యానం నేర్పించారు.

### వైభవంగా అమ్మవారి కల్యాణం



కంచికచర్ల: స్థానిక వసంతకాలనీలో కొలువై ఉన్న శ్రీ మహా విష్ణు సమేత నాగలక్ష్మి అమ్మవారి కల్యాణం సోమవారం కనులపండుగగా సాగింది. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, విశ్వక్షేన ఆరాధన, రక్షా బంధన, అఖండ దీపారాధన, దీక్షాదారణ, నవగ్రహారాధన, త్రయాహినిక దీక్షతో అమ్మవారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. స్వామి వారికి ఎదురెల్లిన భక్తులు పూలు పండ్లు, నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు నన్నపనేని లక్ష్మీనారాయణ, లక్ష్మి దంపతులు పీటలపై కూర్చొని పూజలు చేశారు. కల్యాణోత్సవం అనంతరం 4వేల మందికి అన్నదానం చేశారు.

### పథకాల అమలులో కూటమి విఫలం

సీపీఎం నేత సీహెచ్ బాబూరావు



వీరులపాడు: అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కావస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని వీరులపాడులో ఆయన పేరుతో నిర్మించిన స్మారక స్థూపాన్ని సోమవారం ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఎగురవేశారు.

సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. ఈసందర్భంగా బాబూరావు మాట్లాడుతూ రాజధాని నిర్మాణ పనుల శంకుస్థాపనకు వచ్చిన ప్రధాని నరేంద్రమోడీ వెనుబడిన జిల్లాల అభివృద్ధికి... రాజధాని నిర్మాణానికి ఎటువంటి నిధులు ఇవ్వకపోయినా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆయనను పొగత్తలతో ముంచెత్తడం సిగ్గుచేటన్నారు. కామ్రేడ్ సుందరయ్య నిజమైన దేశభక్తుడని, చిన్న వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని గుర్తుచేశారు.

**విలేకరులపై అక్రమకేసులు దుర్మార్గం..**

సమాజంలో జరుగుతున్న ప్రజావ్యతిరేక విధానాలను, ప్రభుత్వ పనితీరును ప్రజల తరపున ప్రశ్నించే విలేకరులపై అక్రమ కేసులు బనాయించడం కూటమి ప్రభుత్వ దుర్మార్గపు చర్య అని విమర్శించారు. విలేకరులపై బనాయించిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వట్టికొండ పార్థసారధి, కోడూరు పిచ్చేశ్వరరావు, చాట్ల రవి, కోట కల్యాణ్, కటారపు గోపాల్, సీపీఐ నాయకులు వట్టికొండ చంద్రమోహన్, వాసిరెడ్డి రాధాకృష్ణ, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌కు సమస్యల ఏకరువు

- పీజీఆర్ఎస్‌లో 461 అర్జీలు అందజేసిన ప్రజలు
- అత్యధికంగా 215 అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే
- పనితీరు మార్చుకోవాలని అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

జగ్గయ్యపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను అన్నిశాఖల అధికారులు పట్టించుకోవటం లేదంటూ కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని బి కన్వెన్షన్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ప్రజావేదిక సాయంత్రం మూడు గంటల వరకు కొనసాగిందది. దరఖాస్తులు ఇచ్చేందుకు జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అర్జీలు అందించే వారికి 10 కౌంటర్‌లు ఏర్పాటు చేసి ఆన్‌లైన్ చేసిన తరువాతనే టోకెన్‌ల ద్వారా లోపలకు అనుమతించారు.

సమావేశంలో జిల్లా అధికారులు, అర్జీదారులకు వేర్వేరుగా సీట్లు కేటాయించడంతో స్టేజ్‌పై కలెక్టర్‌తో పాటు అధికారులు దరఖాస్తులు తీసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మండలస్థాయిలో అర్జీలు పరిష్కారంగాకపోతుండటంతో జిల్లా యంత్రాంగం నిర్వహించే పీజీఆర్ఎస్‌కు వందలాది అర్జీలు వస్తున్నాయంటూ అధికారులను తీవ్ర స్థాయిలో మందలించారు. జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు. తహసీల్దార్, ఎంపీడీవోల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో అలసత్వ వహిస్తే వేటు తప్పదని హెచ్చరించారు.



ఇసుక అక్రమాలపై కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ మనోహర్, నాయకులు



పీజీఆర్ఎస్‌కు హాజరైన అధికారులు, ప్రజలు

**ఆదుకోవాలంటూ కలెక్టర్‌కు వేడుకోలు..**

తనకు ఉపాధి కల్పించాలంటూ జగ్గయ్యపేటలోని సీతారాంపురానకు చెందిన పులి ప్రవీణ్ కలెక్టర్‌ను కలిసి వేడుకున్నాడు. వెన్నుపూస ఇన్‌ఫెక్షన్ కారణంగా రెండు కాళ్లు చచ్చుబడటంతో రెండేళ్లుగా వీల్‌చైర్‌కే పరిమితమయ్యాయని, తనకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరగా, పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. గతంలో తాను ఉపాధి హామీ పథకం కింద కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేశానని, విద్యుత్ ప్రమాదం కారణంగా 80శాతం మేర కాళ్లుచేతులు పోవడంతో ఇబ్బందిపడుతున్నందున జైపూర్ కాళ్లు, చేతులు అమర్చేలా చేసి తనను ఆదుకోవాలంటూ వత్సవాయి మండలం ఆళ్లూరుపాడు గ్రామానికి చెందిన యాదా గోపాలకృష్ణ కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు .



అర్జీ ఇచ్చేందుకు వచ్చిన దివ్యాంగుడు గోపాలకృష్ణ

**ఇసుక అక్రమాలపై ఫిర్యాదు...**

నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ మైనింగ్, గ్రావెల్, ఇసుక రవాణాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు, కౌన్సిలర్ వట్టెం.. మనోహర్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వత్సవాయి మండలం ఇందుగపల్లిలో అక్రమంగా ఇసుక తరలుతోందని, నియోజకవర్గంలో కొందరు అక్రమ లేఅవుట్లతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని వేపల వాగు, ఎర్ర కాల్వకు ప్రక్షాళన చేయాలని, షేర్‌మహ్మద్‌పేట అడ్డరోడ్డు ఆటోనగర్‌లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన హైవే బస్టాండ్‌ను వినియోగంలోనికి తీసుకురావాలని కలెక్టర్‌ను కోరారు.

**రెవెన్యూ సమస్యలే అధికం...**

జగ్గయ్యపేటలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో 461అర్జీలు రాగా రెవెన్యూ పరమైన రీసర్వే అవకతవకలు, అడంగల్‌లో తప్పులు, సర్వే నంబర్, ఆన్‌లైన్ కాకపోవడం సరిహద్దు తగాదాలు వంటివి 215 అర్జీలు వచ్చాయి. సర్వే సెటిల్‌మెంట్ ల్యాండ్ రికార్డులకు సంబంధించి 36, గ్రామీణ పేదరిక నిర్మూలన 18, పౌరసరఫరాల శాఖ 14, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌పై 14, పోలీస్‌శాఖపై 13, గ్రామీణ నీటి సరఫరాశాఖకు 10, దేవాదాయ శాఖ ఎనిమిది, పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి తొమ్మిది అర్జీలతోపాటు పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 124 అర్జీలు అందాయి. ఇందులో జగ్గయ్యపేట మండలం నుంచే 222 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు.

**వర్మికంపోస్టు విక్రయం..**

పీజీఆర్ఎస్ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. గౌరవరం సచివాలయ సిబ్బంది ఏర్పాటు చేసిన వర్మికంపోస్టు స్టాల్‌ను పరిశీలించి వర్మికంపోస్టు ఎరువును విక్రయించారు. గ్రామకార్యదర్శి సంక్రాంత్‌ను అభినందించారు.

## రాష్ట్రంలో తీవ్రంగా నిరుద్యోగ సమస్య : బీఎస్పీ

నందిగామరూరల్: రాష్ట్రంలో ఉన్నంత నిరుద్యోగ సమస్య దేశంలోని ఏరాష్ట్రంలో లేదని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్ అన్నారు. పట్టణంలోని ఓసీ క్లబ్‌లో ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు యరగొర్ల ఉదయ్‌కిరణ్‌యాదవ్ అధ్యక్షతన సోమవారం బహుజన సంకల్ప సభ నిర్వహించారు. సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 5.5 కోట్ల మంది జనాభా ఉంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లింలు 4.5 కోట్ల మంది ఉన్నారన్నారు. వీరందరికి బహుజన్ సమాజ్ పార్టీ అండగా ఉంటుందన్నారు. బీఎస్పీ చేసిన పోరాటంతోనే కేంద్ర ప్రభుత్వం కులగణనకు అంగీకరించిందన్నారు. ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజ్, రాష్ట్ర కార్యదర్శి గంగవరపు దేవా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు ఏజెంట్‌లుగా మారాయన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం ఏడాదిగా అమలు చేయలేకపోయిందని విమర్శించారు. విద్యార్థులు, యువత, మహిళలు, రైతులను కూటమి ప్రభుత్వం పూర్తిగా వంచించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొండపాటి శ్యామ్యూల్‌కుమార్, కె.వి.కోటేశ్వరరావు, దాసరి కృష్ణ, కె.వి.రత్నం, మల్లాది అశోక్, నందిగం రామ్మోహన్, చింతల రమణ, డానియేల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌కుమార్

## తన్నీరు నాగేశ్వరరావు హౌస్ అరెస్ట్

**తిరువూరు వెళ్లకుండా అడ్డగింత**

జగ్గయ్యపేట అర్బన్: తిరువూరు నగరపంచాయతీ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో పోలీసులు సోమవారం వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు హౌస్ అరెస్ట్ చేశారు. జగ్గయ్యపేట పట్టణ పోలీసులు ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట వరకు తన్నీరును హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ శాంతిభద్రతల సమస్యను సాకుగా చూపి వైఎస్సార్ సీపీ నేతలను హౌస్ అరెస్ట్ చేయడం అప్రజాస్వామ్యమన్నారు. రాజ్యాంగ హక్కులను సైతం కూటమి ప్రభుత్వం కాలరాస్తోందని ధ్వజమెత్తారు.తిరువూరు మున్సిపాలిటీని దొడ్డిదారిలో కైవసం చేసుకునేందుకు కుయుక్తులు పన్నుతోందని విమర్శించారు. 20మంది కౌన్సిలర్లలో 17మంది వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఉండగా, కేవలం ముగ్గురు కౌన్సిలర్లు మాత్రమే ఉన్న టీడీపీ నాయకులు చైర్మన్ పదవిని కైవసం చేసుకోవాలనుకోవడం సిగ్గుచేటన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకొని తిరువూరు మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలని కుయుక్తులు పన్నినా ఫలితం శూన్యమన్నారు. ఇటువంటి అప్రజాస్వామిక చర్యలను మానుకోవాలని కూటమి నేతలకు హితవు పలికారు.



పేటలో తన్నీరు నాగేశ్వరరావును ఆయన నివాసంలో హౌస్ అరెస్ట్ చేసిన ఎస్ఐ జి.రాజు

## పీజీఆర్ఎస్ వేదికపై ‘నెట్టెం’

**నిస్సహాయ స్థితిలో అధికారులు**

జగ్గయ్యపేట: కోదాడ రోడ్డులోని బీ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం జరిగిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో మాజీమంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం ప్రోటోకాల్ నిబంధనలు ఉల్లంఘించి అధికారిక కార్యక్రమ స్టేజీపై ఆసీనులు కావటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించ్రీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర హాజరయ్యారు. ఈక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న నెట్టెం రఘురాం కూడా వేదికపై అధికారుల కూర్చోవడంతో అధికారులు ఒకింత ఇబ్బంది పడ్డారు. రఘురామ్ను తీరును చూసి పలువురు టీడీపీ కార్యకర్తలు, ప్రజలు సైతం విస్తుపోయారు. ఇటీవల కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా నెట్టెం రఘురాం పేరును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ పదవీ బాధ్యతలు స్వీకరించడానే ఇలా జిల్లా అత్యున్నత అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన అధికారిక కార్యక్రమ వేదికపై రఘురాం ఆసీనులు కావడంపై అధికారులు, ప్రజల నుంచి గుసగుసలు వినిపించాయి. అధికారపార్టీ అధ్యక్షుడైతే మాత్రం ఇలా చేయడం తగదని పీజీఆర్ఎస్ కార్యక్రమ హాలులో జనం చర్చించుకోవడం కనిపించింది.



ప్రజాపరిష్కార వేదికపై ఎమ్మెల్యే తాతయ్య పక్కన కూర్చున్న నెట్టెం రఘురాం

### మజ్జిగ పంపిణీ

నందిగామరూరల్: సత్య దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో ప్రజలు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేయటం సంతోషంగా ఉందని నిర్వాహకుడు కోటి సూర్యం పేర్కొన్నారు. సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో వేసవిలో ప్రజలు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు. సేవా సమితి ఆధ్వర్యంలో 12ఏళ్లుగా వికలాంగులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. 10 ఏళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేసి చల్లని తాగునీరు, మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.

### ఏఈవోలతో సమీక్ష

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో ప్రొటోకాల్ దర్శనాలు, భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆలయ ఈఓ శీనానాయక్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంద్రకీలాద్రిపై తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ఏఈవోలు ఎస్. రమేష్‌బాబు, పి.చంద్రశేఖర్, జంగం శ్రీనివాసరావులతో ఈఓ సమీక్షించి పలు సూచనలు చేశారు.

## పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



నందిగామలో సుందరయ్యకు నివాళులర్పిస్తున్న కటారపు గోపాల్, నాయకులు



వత్సవాయిలో మజ్జిగ పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

నందిగామటౌన్: పేదల కోసం పనిచేసిన పుచ్చలపల్లి సుందరయ్య కమ్యూనిస్టుగాంధీగా పేరు తెచ్చుకొన్న గొప్ప పోరాట యోధుడని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కటారపు గోపాల్ కొనియాడారు. పట్టణంలోని 18వ వార్డులో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా తెలంగాణ సాయుధ పోరాటం, అఖిల భారత కిసాన్ సభ ప్రారంభకుల్లో సుందరయ్య ప్రముఖుడని పేర్కొన్నారు. కొన్ని వందల ఎకరాల భూములను పేదలకు పంచిపెట్టారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ ఖాశించ రవిశేఖర్, ఉప్పు శ్రీను, కరి వెంకటేశ్వరరావు, పాల శ్రీను, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పెనుగంచిప్రోలులో..**

పెనుగంచిప్రోలు: తుదిశ్వాస వరకు పేదల పక్షాన నిలిచిన వ్యక్తి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సీఐటీయూ మండల కార్యదర్శి దారా నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిన మహోన్నత వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు గజ్జి పెద్దిరాజు, ధనమ్మ, అంకులు, కొండలు తదితరులు పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలులో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**వత్సవాయిలో...**

వత్సవాయి: కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం వత్సవాయిలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఆపార్టీ నాయకులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల పక్షాన నిలబడి వారి అభివృద్ధి కోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. ఈ తరం నాయకులకు సుందరయ్య ఆదర్శప్రాయులన్నారు. అనంతరం గ్రామంలో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ నాయకులు చిరుమామిళ్ల హనుమంతురావు, మండల పార్టీ కార్యదర్శి బి.రాము, మండల కమిటీ సభ్యులు కే వెంకటేశ్వర్లు, జి.వెంకటేశ్వర్లు, బి.బిక్షం, ఆర్.దేవయ్య, ప్రసాద్, పెద్దిరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

**మార్కపూడి గాంధీ**

జగ్గయ్యపేట అర్బన్: దళితులను టార్గెట్ చేసి వారిపై వరుస దాడులకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వానికి భవిష్యత్‌లో దళితులు తగిన గుణపాఠం చెబుతారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మార్కపూడి గాంధీ హెచ్చరించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పలువురు ఎస్సీ నాయకులతో కలిసి సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. దళితులు అంటే మొదటి నుంచి సీఎం చంద్రబాబుకు చులకన భావం ఉందని, ఆయన పాలనలో అది రోజురోజుకు నిరూపితమవుతోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే దళితులపై దాడులు, అరెస్ట్‌ల పర్వం మొదలుకావడమే ఇందుకు నిదర్శనమన్నారు. అక్రమ అరెస్ట్‌లకు సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ మూల్యం చెల్లించక తప్పదన్నారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదనే విషయాన్ని పోలీసులు గుర్తించాలని, కోర్టుల ఆదేశాలను సైతం పట్టించుకోకపోవడం తగదన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, నాయకులు

**వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే అరెస్ట్‌లు...**

కూటమి ప్రభుత్వ పాలన పూర్తిగా పక్కదోవ పట్టిందని, వరుస వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే అక్రమ అరెస్ట్‌లు, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని గాంధీ ఆరోపించారు. వైఎస్సార్ సీపీకి రోజురోజుకు ప్రజల్లో ఆదరణ పెరుగుతుండటాన్ని సహించలేకనే కూటమి ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతోందన్నారు. సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లపై తప్పుడు కేసులు పెట్టి వేధించడం తగదన్నారు. టీడీపీకి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లు నేటికీ ఎటువంటి పోస్టులు పెడుతున్నారో తెలియదా అని ప్రశ్నించారు. వారిపై ఒక్క కేసైనా పెడుతున్నారా అని నిలదీశారు. కూటమి ప్రభుత్వం చూపుతున్న బాటలోనే భవిష్యత్‌లో వైఎస్సార్ సీపీ కూడా పనిచేయదని అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. తిరువూరు నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక సందర్భంగా పోలీసులు, అధికారులు నిస్సహాయులుగా వ్యవహరించడం యావత్ ప్రపంచం చూసి నివ్వెరపోయిందన్నారు. పార్టీ పేట ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావును హౌస్ అరెస్ట్ చేయడం అప్రజాస్వామ్యమన్నారు. పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు కేసల లోకేష్, పట్టణ కార్యదర్శి దార్ల ప్రసన్నకుమార్, నియోజకవర్గ కార్మిక విభాగం అధ్యక్షుడు మెండెం రామారావు, తిరుమలగిరి గ్రామ పార్టీ అధ్యక్షుడు కరిసె ఇశ్రాయేలు, పట్టణ ఎస్సీసెల్ నాయకులు ఉప్పెల్లి పెంటయ్య, మాజీ సర్పంచ్ ఉదయభాను, ఉప సర్పంచ్ గొట్టిపాటి లక్ష్మీనారాయణ, ఎస్సీ నాయకులు జక్కులూరి దేవదాసు, గొర్రెపాటి బుల్లియ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

### మండప నిర్మాణానికి శంకుస్థాపన



గండేపల్లి(కంచికచర్ల) : మండలంలోని గండేపల్లి సీఎస్ఐ చర్చి ఆవరణలో నిర్మించనున్న ఆలయ కళ్యాణ మండపం నిర్మాణ పనులకు జిల్లా బీసీసెల్ నాయకులు పరిటాల రామకోటేశ్వరరావు, సర్పంచి బొక్కా రవికుమార్ సోమవారం శంకుస్థాపన చేశారు. ముందుగా పాస్టర్ రెవరెండ్ కొండా స్టాలిన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కల్యాణ మండపం నిర్మాణానికి గ్రామంలోని సెంటినీ బయోప్రొడక్ట్ కంపెనీ యాజమాన్యం త్రిపురనేని శేషగిరిరావు ఇనుము అందజేసినందుకు ఆలయ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. కార్యక్రమంలో సంఘ కమిటీ సభ్యులు మార్కపూడి మధుబాబు, శ్రీరాం మల్లికార్జునరావు, బొక్కా రవికుమార్, బొక్కా దేవనందం, చాట్ల స్వామి, నరసింహారావు, మీసాల కిరణ్, బొక్కా చంటి తదితరులు పాల్గొన్నారు.

### 23న ఆలయ భూముల కౌలు వేలం

నందిగామరూరల్: ఆయా ఆలయ భూములకు ఈనెల 23న బహిరంగ కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ నరసింహమూర్తి సోమవారం తెలిపారు. వీరులపాడు మండలం జయంతి గ్రామంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయానికి చెందిన 15.34 ఎకరాల వ్యవసాయ భూములకు ఉదయం 10 గంటలకు, కొణతాలపల్లి భ్రమరాంభ సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి చెందిన 18.19 ఎకరాల భూములకు మధ్యాహ్నం 12 గంటలకు కౌలువేలం నిర్వహిస్తామన్నారు. నందిగామ మండలం కొణతమాత్మకూరులోని మల్లికార్జునస్వామి ఆలయానికి చెందిన 12.50ఎకరాల వ్యవసాయ భూములకు మధ్యాహ్నం మూడు గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు. ఆయా ఆలయాల ఆవరణలో జరిగే ఈ కౌలువేలం పాటల్లో ఆసక్తిగల రైతులు పాల్గొనాలని ఈఓ కోరారు.

### కవితా సంపుటి అందజేత



కంచికచర్ల: ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, కంచికచర్లలో బహుజనుల రచయితల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తంగిరాల సోనీని సోమవారం కలిశారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న వెంకన్న మార్గ మధ్యంలో కంచికచర్లలో తంగిరాల సోనిని కలిసి కవితలు, పద్యాలు, రచనలపై కొద్ది సేపు ముచ్చటించారు. అనంతరం సోనీ గోరేటి వెంకన్నకు కవితా సంపుటి బ్లాక్‌వాయిస్‌తోపాటు కొన్ని కవితలు అందజేశారు. కార్యక్రమంలో కవి కోయి కోటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టు తాడి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### పెట్రోల్ బంక్ ప్రారంభం



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మౌనిక-చేరిపెల్లి-పిడికిటి పెట్రోలు బంక్‌ను సోమవారం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈప్రాంత రైతులు, వినియోగదారుల కోసం పెట్రోలు బంక్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. వినియోగదారులకు నాణ్యమైన పెట్రోలు, డీజిల్‌ను అందించాలంటూ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్కపూడి గాంధీ, ఆపార్టీ నేతలు బత్తుల రామారావు, కన్నమాల శామ్యూల్, కొత్తపల్లి పెంటయ్య, పొన్నం కోటేశ్వరరావు, వూట్ల నాగేశ్వరరావు, కనకపూడి భాస్కరరావు, నంబూరి రవి, వట్టెం మనోహర్, గుడిమెట్ల శంకర్, యానాల సురేష్, గుంటుపల్లి వాసు, పిడికిటి కోటేశ్వరరావు, శ్రీఅయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు వాసిరెడ్డి బెనర్జీ పాల్గొనఆనరు. అదేవిధంగా జనసేన జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను పాల్గొని బంక్ యజమానులకు అభినందనలు తెలియజేశారు.